సాక్షి ప్రకాశం
బుధవారం । 10 । జనవరి । 2024



అట్టహాసంగా అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు

కొరిశపాడు మండలం రావినూతలలో టీ–20 క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

- 8లో..



రోడ్డు ప్రమాదంలో వలంటీర్ దుర్మరణం

రోడ్డుపై వెళ్తున్న బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

ఉదయం పొగమంచు అధికంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఒంగోలు చేరుకొని విలేకరుల సమావేశంలో పాల్గొననున్నారు. ఆయన పర్యటన వివరాలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ సెక్రటరీ హర్షవర్ధన్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

● ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ

ఒంగోలు అర్బన్: రానున్న సాధారణ ఎన్నికల కోసం ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి మౌలిక వసతులు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో మంగళవారం ఆర్‌డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22న తుది ఓటరు జాబితా విడుదలవుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు తహశీల్దార్ మురళి, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు సంజీవ్, స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్, రమేష్, శ్రీదేవి పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో ఖరీదైన వైద్యం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రాజ్యలక్ష్మి



రోగుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, అధికారులు, సిబ్బంది

మద్దిపాడు: పైసా కూడా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని సీతారాంపురం కొష్టాల సెంటర్ మండల పరిషత్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని చెప్పారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారిని నిపుణులైన వైద్యులు కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారని తెలిపారు. శిబిరంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ తనిఖీ చేసిన ఆమె రోగులను రిజిస్ట్రేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేషంగా స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. మంగళవారం జరిగిన వైద్య శిబిరంలో 253 మంది వినియోగించుకొని పరీక్షలు చేయించుకోగా..అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహశీల్దార్ ఆశా జ్యోతి, స్పెషలిస్ట్ డాక్టర్లు బి.రామాంజనేయులు ఎస్ సుజని సుష్మిత వసంత్, పీహెచ్‌సీ డాక్టర్లు ఆనందమోహన్, శ్రావణ్, జగదీష్‌బాబు, వినీల చౌదరి, పీహెచ్‌సీ సిబ్బంది, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఆశావర్కర్లు ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ

ఒంగోలు: నిరుద్యోగ యువతీ యువకులకు కీట్సు ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు కో ఆర్డినేటర్ హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని నందిగామలో హెల్త్‌కేర్ కౌన్సిలర్/ కోఆర్డినేటర్ కోర్సులో శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఏదేని డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. 19 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. శిక్షణ విజయవాడ సమీపంలోని నందిగామలో ఉంటుందని, ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. 60 రోజుల శిక్షణ కాలంలో హెల్త్‌కేర్, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం 100 శాతం వివిధ కార్పొరేట్ ఆసుపత్రులు, హెల్త్ కేర్, బీపీవో వంటి సంస్థల్లో కనీస వేతనం రూ. 20 వేలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 90004 87423 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సేంద్రియ సాగు.. లాభాలెన్నో

సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ఆహారోత్పత్తులు ఆరోగ్యానికి మహాభాగ్యం.. వీటిల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచే 'యాంటీ ఆక్సిడెంట్స్' వంటి విశిష్ట పోషకాలు అధిక మోతాదులో ఉంటాయి..ఇది నాణేనికి ఒక వైపు.. ఇవి ప్రకృతి వైపరీత్యాలను సైతం సమర్థవంతంగా తట్టుకుంటాయి.
వేర్లు బలంగా భూమిలోకి చొచ్చుకుపోతాయి. ఫలితంగా తుఫాన్లు, భారీ వర్షాలకు తట్టుకుంటాయి. నష్టం కూడా చాలా తక్కువే అంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. దీంతో రైతులు సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపిస్తున్నారు.

- ఆరోగ్యానికి మేలు చేసే సేంద్రియ ఉత్పత్తులు
- ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడుతున్న పైర్లు
- వేరు బలంగా పెరగడం కారణమంటున్న వ్యవసాయ నిపుణులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- మొగ్గు చూపుతున్న అన్నదాతలు



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కొత్తపట్నంలో సాగుచేసిన వరి

ఒంగోలు సెంట్రల్: సేంద్రియ వ్యవసాయంతో సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాలను సైతం సమర్థవంతంగా తట్టుకుంటున్నాయి. పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు అవశేషాల్లేని పంటలను పండించటానికి ప్రభుత్వం సైతం ప్రోత్సహిస్తుండటంతో దీనిపై రైతులు మక్కువ చూపుతున్నారు. రసాయనిక మందులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించుకుంటున్నారు. జిల్లాలో 98 వేల ఎకరాలు సాగు లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. జిల్లాలో 187 గ్రామ పంచాయతీల్లో 364 పొదుపు సంఘాల్లో కలిసి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. గత ఏడాది 40 వేల మంది రైతులు 45 వేల ఎకరాల్లో సాగు చేయగా, ఈ దఫా 49,250 మంది రైతులు 98 వేల ఎకరాల్లో సాగు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు 30,500 మంది రైతులతో 38,525 ఎకరాల వరకు సాగు చేశారు. ఆయా పంటలు తుఫాన్ ధాటికి తట్టుకుని నిలబడటంతో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మరింత ధీమా ఏర్పడింది.



ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన జొన్న

'కనిగిరి మండలం పునుగోడుకు చెందిన నల్లమల్లు విజయలక్ష్మి నల్లనేలల్లో నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వరి బీపీటీ 5204 రకాన్ని సాగు చేశారు. వేర్లు 12.7 సెం.మీలు భూమిలోనికి వెళ్లి బలంగా ఉండటంతో ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుని నిలిచింది. 5శాతం మాత్రమే నష్టం వాటిల్లింది. ఇదే గ్రామానికి చెందిన అల్లెటిపల్లి వీరభద్రయ్య రసాయనికంగా వరి సాగుచేశారు. వర్షానికి పూర్తిగా దెబ్బతింది. ఆయన నాటిన వరికి వేరు 9 సెం.మీల మేర మాత్రమే భూమిలోకి వెళ్లింది.

తూర్పు గంగవరానికి చెందిన బాల కృష్ణారెడ్డి వరి బీపీటీ రకాన్ని రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్నారు. వరి వేర్లు 10.4 సెం.మీతో దెబ్బతినకుండా పంటను ఇవ్వగా, అదే మరో ఎకరంలో రసాయనిక ఎరువులతో వేసిన పంట దెబ్బ తింది.



నాగులుప్పలపాడులో సాగులో ఉన్న మిరప

ప్రకృతి వ్యవసాయంతో ధీమా



అధికారుల సూచనల మేరకు నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. రసాయనిక ఎరువులతో సాగు చేసిన వరికి, ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేసిన వరికి మధ్య తేడా వర్షాలు, గాలుల సమయంలో అర్థమవుతోంది. ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన వరి తట్టుకుని నిలబడి నష్టాలు లేకుండా చేసింది.

– నల్లమల్లు విజయలక్ష్మి, పునుగోడు, కనిగిరి మండలం

ఆరోగ్యకరమైన పంట



ప్రకృతి వ్యవసాయంతో సాగుచేస్తే అధిక దిగుబడి రావడంతో పాటు ఆరోగ్యకరమైన పంట చేతికి వస్తుంది. ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుని నిలబడటంతో ఈ విధానంపై మరింత నమ్మకం పెరిగింది. గత నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం.

– పటువు సురేష్, కొత్తపట్నం

ప్రకృతి వైపరీత్యాలతో భయం ఉండదు



వర్షాభావ పరిస్థితుల్లో కూడా పొలాలు ఖాళీ లేకుండా చేసుకోవచ్చు. సాధారణ రసాయనిక ఎరువుల్లో సాగు చేసిన పంటలకు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేసిన పైర్లకు పెరుగుదల, వేరు వ్యవస్థలో స్పష్టమైన మార్పులు ఉన్నాయి. బలమైన వేరు వ్యవస్థ కలిగి ఉండటంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి భయం అవసరం లేదు.

– వి.సుభాషిణి, ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

● జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈఓ జాలిరెడ్డి

ఒంగోలు సెంట్రల్:

జిల్లాలో పంచాయతీల అభివృద్ధికి అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ బి.జాలిరెడ్డి అన్నారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25 ఆర్థిక సంవత్సరానికి తయారు చేసే నిమిత్తం స్థానిక స్పందన కలెక్టర్ కార్యాలయంలో మండల అధికారుల బృందానికి మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు ముఖ్య అతిథిగా పాల్గొన్న జాలిరెడ్డి మాట్లాడుతూ మండల, గ్రామ పంచాయతీ అభివృద్ధిలో అన్ని శాఖలు సమ్మిళితం చేసి తయారు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం, అటవీ, పంచాయతీ రాజ్, నీటి సరఫరా తదితర శాఖలు కూడా తమ కార్యాచరణ ప్రణాళికలు, మండల, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికతో సమ్మిళితం చేసి ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి బీవీ నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాలు సుస్థిరంగా అభివృద్ధి చెందాలంటే తగిన ప్రణాళికలు తయారు చేసుకొని పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలని చెప్పారు. 17 సుస్థిర లక్ష్యాలు సాధించడానికి నవరత్నాలు, ఉపాధిహామీ పథకం, నాడు– నేడు, జల జీవన్ మిషన్, విద్య వైద్య రంగాలకు సంబంధించిన పథకాల ద్వారా సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి మండలం నుంచి ఆరుగురు ట్రైనింగ్ ఆఫ్ ట్రైనీస్ ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, పీఆర్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మర్దన్ ఆలీ, పీఆర్ ఎస్ఈ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జనరంజక పాలన

- ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన 99 శాతం హామీలు అమలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



బాలినేని శ్రీనివాసరెడ్డి



జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకుంటూ అధికారంలోకి వస్తే వారి సంక్షేమానికి ఏం చేయాలనే తలంపుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టారన్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ అలుపెరగకుండా పాదయాత్ర సాగించారన్నారు. పాదయాత్రలో ప్రజల సమస్యలను మేనిఫెస్టోగా పెట్టి అధికారంలోకి వచ్చి 99 శాతానికి పైగా హామీలు అమలు చేశారని కొనియాడారు. ప్రజలకు హామీ ఇవ్వని ఎన్నో సంక్షేమ పథకాలను సైతం అమలు చేస్తున్నారని చెప్పారు. కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా వేగవంతంగా రామాయపట్నం పోర్టును కూడా పూర్తిచేస్తున్నారని, ఈ పోర్టుతో అటు నెల్లూరు, ఇటు ప్రకాశం జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయన్నారు. జగనన్న ఇళ్ల కాలనీల ద్వారా ఎంతో మంది పేదలకు సొంతింటి కలను నెరవేర్చారన్నారు. ఎన్నికల వేళ మరోమారు ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో యత్నిస్తున్నారని వారి కుయుక్తులను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పాలనలో ఆర్టీసీ కార్మికుల జీవనం ఎంత దుర్భరంగా ఉండేదో అందరికీ తెలుసని, కానీ నేడు క్రమం తప్పకుండా ప్రభుత్వం ద్వారా జీతాలు తీసుకుంటున్నారంటే అందుకు కారణం ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీనేనన్నారు. రానున్న ఎన్నికలు పేద, బడుగు, బలహీనవర్గాల పక్షపాతి అయిన వైఎస్సార్ సీపీకి, పెత్తందార్లకు మధ్య జరుగుతున్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు హయాంలో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యమైతే..వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు–నేడుతో పాటు డిజిటల్ విద్య వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా నాణ్యమైన వైద్యం అందిస్తూ అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వచ్చి చేరుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద ద్వారా అత్యంత నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. చంద్రబాబు హయాంలో రైతులు కరువు కోరల్లో చిక్కి నష్టపోతే ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదని, కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటున్నామన్నారు. పండించిన పంటను కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తూ రైతులకు మద్దతు ధర అందుతుందన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం కల్ల



క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

● రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం కల్ల అని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర 5 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం ఒంగోలులోని క్యాంపు కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ... ఎవరెన్ని జాకీలు పెట్టి లేపినా నిలబడే పరిస్థితి టీడీపీకి లేదన్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు గురించి చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. తాను అధికారంలోకి వచ్చి ఉంటే కేవలం ఆరు నెలల్లో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఉండేవాడినని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు వెలిగొండను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. బాబు ఏం చేశారో ప్రజలకు బాగా తెలుసని ఎద్దేవా చేశారు. ప్రజా సంకల్ప యాత్ర ద్వారా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను తెలుసుకున్న జగనన్న అధికారంలోకి రాగానే 99 శాతం హామీలను నెరవేర్చారని చెప్పారు. రాష్ట్రంలో ఎంతమంది పాదయాత్రలు చేసినా జగనన్న చేసిన పాదయాత్ర ఒక్కటే చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నమ్మకానికి మారుపేరైన సీఎం జగనన్నను ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.

సామాజిక న్యాయాన్ని చేతలతో చూపిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ ఫలాలను అనుభవించిన ప్రజలే ఆయన్ను మళ్లీ గెలిపించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు.

సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నాలు పండుగలు



నృత్య ప్రదర్శనలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు సిటీ: సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నాలుగా పండుగలు నిలుస్తాయని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. నూతన జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీరాజ్ ఉద్యోగులు నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు అతిపెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. యువతరం సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. హరిదాసులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, కోలాటాలు, రంగవల్లులు మొదలగు ఆటల పోటీలు తెలుగువారి పౌరుషానికి ప్రతీకలన్నారు. పంచాయతీరాజ్ సిబ్బంది ఐకమత్యంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో చందు డ్యాన్స్ అకాడమీ వారు ప్రదర్శించిన నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అచ్యుత్ ఆర్కెస్ట్రా వారి పాటలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, అకౌంట్స్ అధికారి వాకా శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, కార్యదర్శి కిరణ్‌కుమార్, జిల్లా పరిషత్ యూనిట్ అధ్యక్షుడు పిట్టు శ్రీనివాసరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, స్టేట్ ఆడిట్ ఏఏ ఓ రమేష్ జెడ్పీ కార్యాలయ పరిపాలనాధికారులు సత్యంరెడ్డి, విజయలక్ష్మి, సుశీల, రెహమాన్, రవిప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

దర్శి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో దర్శిలో ఈ నెల 10 నుంచి జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం కానున్నాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఎడ్ల బల ప్రదర్శన పోటీలతో పాటు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. పోటీలను తిలకించేందుకు వచ్చే వారికి భోజన ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



ఎడ్ల పోటీలకు సిద్ధం చేసిన మైదానం

11 నుంచి రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

ఒంగోలు టౌన్: అఖిల భారత యువజన సమాఖ్య 73వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఈ నెల 11 నుంచి రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించే పోటీలు నాకౌట్ కం లీగ్ పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.150 రుసుం చెల్లించాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.8 వేలు, మూడో బహుమతి రూ.6 వేలు, నాల్గవ బహుమతి రూ.4 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9703610685, 7382730961 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి



సంఘటనా స్థలంలో సుబ్బయ్య మృతదేహం

మద్దిపాడు: ప్రమాదవశాత్తు ట్రాలీ ఆటో బోల్తా కొట్టి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని జి.అగ్రహారం వద్ద కర్నూలు–ఒంగోలు హైవేపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. వేటపాలెం మండలం అదే గ్రామానికి చెందిన కావూరి సుబ్బయ్య(51) కుంట వద్ద గేదెలు కొనుగోలు చేసి ట్రాలీ ఆటోలో తిరిగి వెళ్తుండగా మండలంలోని జి.అగ్రహారం గ్రామానికి చేరుకోగానే కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి ట్రాలీ ఆటో బోల్తా పడింది. కావూరి సుబ్బయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువు కె.ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అట్టహాసంగా అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు

- తొలిరోజు విజేతలుగా హైదరాబాద్, వైజాగ్ జట్లు

మేదరమెట్ల: అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు సంబరాలతో మొదలయ్యాయి. కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, భ్రమర సంక్రాంతి కప్ పేరుతో నిర్వహిస్తున్న టీ–20 క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన రెండు మ్యాచ్‌ల్లో చిక్కోల్ చీతాస్ వైజాగ్, కోకా ఇన్‌ఫ్రా హైదరాబాద్ జట్లు విజయం సాధించాయి. ఉదయం జరిగిన మ్యాచ్ జీడీసీఏ లెవెన్ గుంటూరు–చిక్కోలీ చీతాస్ వైజాగ్ జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న వైజాగ్ బౌలర్ల దాటికి జీడీసీఏ లెవెన్ గుంటూరు జట్టు 15 ఓవర్లు మాత్రమే ఆడి 89 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. వైజాగ్ జట్టు బౌలర్లు సాత్విక్ కేవలం 3 ఓవర్లు వేసి 21 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. మరో బౌలర అబ్దుల్లా 3 ఓవర్లలో 18 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టు బ్యాటర్లకు చుక్కలు చూపించారు. అనంతరం 90 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన వైజాగ్ మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి కేవలం 9.2 ఓవర్లలో విజయ లక్ష్యాన్ని చేరుకున్నారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరాబాద్–సీడీసీఏ లెవెన్ తిరుపతి జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఆరంభించిన కోకా ఇన్‌ఫ్రా హైదరాబాద్ బ్యాట్స్‌మెన్ ధాటికి తిరుపతి జట్టు బౌలర్లు చేతులెత్తేశారు. 20 ఓవర్లలో ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి హైదరాబాద్ జట్టు 213 పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టులో తేజ కేవలం 59 బంతుల్లో 119 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి జట్టు 18.4 ఓవర్లలో 106 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో హైదరాబాద్ జట్టు 107 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సినీనటుడు రఘుబాబు

చుట్టుపక్కల ఎక్కడా లేనివిధంగా స్టేడియం ఉంది..

భ్రమర సంక్రాతి కప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భారత బ్యాట్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం చెంచు పున్నయ్య చౌదరి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రికెట్ స్టేడియం కానీ పిచ్ గానీ సమీపంలో ఎక్కడా లేని విధంగా ఉందన్నారు. కార్యక్రమానికి ప్రముఖ సినీనటులు యర్రా రఘుబాబు అధ్యక్షత వహించారు. తనదైన శైలిలో ఆయన ప్రేక్షకులను నవ్వుల్లో మునిగేలా చేశారు. కార్యక్రమంలో భ్రమర టౌన్‌షిప్ ఎండీ గళ్లా రామచంద్రరావు మాట్లాడుతూ 30వ టీ20 అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని, నాకౌట్ కం లీగ్ పద్ధతిలో జరిగే పోటీల్లో 16 జట్లు పాల్గొంటాయన్నారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటున్నాయన్నారు. మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, రెండో బహుమతిగా రూ.2 లక్షలు, మూడో బహుమతిగా రూ.1 లక్ష అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బీ.జవహర్, ఎస్.మోహన్‌దాస్, అధ్యక్ష్యుడు కారుసాల నాగేశ్వరావు, కార్యదర్శి ప్రతాప్, కార్యవర్గ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి మ్యాచ్‌లు..

ఉదయం యువన్ ప్రాపర్టీస్ హైదరాబాద్, ఎంఆర్‌సీసీ లెవెన్ చెన్నై జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. మధ్యాహ్నం మ్యాచ్ సౌత్‌జోన్ సీసీ చెన్నై– అస్పైర్ లెవెన్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రారంభోత్సవంలో బ్యాటింగ్ చేస్తున్న కరణం చెంచు పున్నయ్య చౌదరి

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



మృతి చెందిన రంగస్వామి

రాచర్ల: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పలుగుంటిపల్లె గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్సై ఆదిశేషయ్య కథనం ప్రకారం.. రాచర్ల పంచాయతీ పరిధిలోని పలుగుంటిపల్లె గ్రామానికి చెందిన కె.రంగస్వామి(35) అనే యువకుడు వ్యవసాయ పొలంలోని మోటరుకు విద్యుత్ తీగలు లాగుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తీగలు కాలికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రంగస్వామికి భార్య సలోమితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఆదిశేషయ్య తెలిపారు.

Paper Publication
(Substituted Service)
FORM NO.14
[See Regulation 33 (2)]

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam, Sai Baba Street,
Daba Gardens, Visakhapatnam - 530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)

R.P.No.34 of 2022 in OA No.162 of 2020

Union Bank of India,Tangutur, Prakasam District
Versus
Mallika Vermi Compost & another

To
(CDR1) Mallika Vermi Compost, Valeti Mallika, W/o Valeti Venkata Narasimham, 3-65, Yedlurupadu, Jarugumalli Mandal, Prakasam District.
(CDR 2) Valeti Venkata Narasimham, S/o Chinna Venkateswarlu, 3-65, Yedlurupadu, Jarugumalli Mandal, Prakasam District

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM OA/162/2020 an amount of Rs.25,41,842/- (Rupees Twenty Five Lakhs Forty One Thousand Eight Hundred and Forty Two Only) along with pendentellite and future interest @ 12.05 % p.a. with Interest monthly w.e.f.14-02-2020 till realization and costs has become due against you (Jointly and severally / Fully / Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 23/01/2024 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay : -
   (a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
   (b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 12/12/2023

(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer

వైఎస్సార్ ఆశయాలే జగన్ ప్రభుత్వ లక్ష్యాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జంకె

మార్కాపురం: మహానేత వైఎస్సార్ ఆశయాలే జగన్ ప్రభుత్వ లక్ష్యాలని, పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను దగ్గరగా చూసి మేనిఫెస్టో రూపొందించిన జగన్ అధికారం చేపట్టిన తర్వాత నూరు శాతం హామీలు నెరవేర్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, పార్టీ నాయకులు మందటి మహేశ్వర్‌రెడ్డి, పంబి వెంకటరెడ్డి, సాంబశివారెడ్డి, బూదాల గురవయ్య, రమణారెడ్డి, గౌస్ మొహిద్దీన్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఎస్‌టీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ఏపీఎస్‌ఎస్‌టీఎఫ్ నూతన కార్యవర్గం

ఒంగోలు: ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం(ఏపీఎస్ఎస్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా వీఎస్ రవికాంత్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక ప్రక్రియను రాష్ట్ర బాధ్యులు టి.రమేష్ పర్యవేక్షించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా టి.అన్నపూర్ణ, ఆర్థిక కార్యదర్శిగా కె.రాము, రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా సీహెచ్.శ్రీనివాసరావు, టి.రమేష్, బి.తిరుపతయ్య, మహిళా కార్యదర్శులుగా కె.తిరుమల, వి.చైతన్యవాణి, సంయుక్త కార్యదర్శులుగా పీవీ రమణయ్య, ఎస్‌కే మొహినుద్దీన్, డివిజినల్ కార్యదర్శులుగా బ్రహ్మానందరెడ్డి, కోటి ప్రసన్న, స్వర్ణలత, సలహాదారులుగా వి.నాగమూర్తి, కె.వాసుదేవమూర్తి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన ఫోరం సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి అభినందించారు.

Paper Publication
(Substituted Service)
FORM NO.14
[See Regulation 33 (2)]

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam, Sai Baba Street,
Daba Gardens, Visakhapatnam - 530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)

R.P.No.414 of 2019 in OA No.887 of 2018

Union Bank of India,Tangutur, Prakasam District
Versus
M/s Patanjali Ongole Enterprises & Others

To
(CDR1) M/s Patanjali Ongole Enterprises, represented by its partners Sri Parvathareddy Yedukondalu & Gandhavalla Guruvardhini, situated at D.No.3/39, Satyanarayanapuram, 60 ft east road, besides Union Bank of India, Gandhi road, Ongole-523001
(CDR 2) Sri Parvathareddy Yedukondalu, S/o Punnaiah, 24-2-8, Navuluri Vari Street, Near old Government Hospital, Ongole.
(CDR 3) Sri Gandhavalla Balasubramanyam, S/o Veerabadraiah, residing at 4/245, Satyanarayanapuram, Dibbal Road, Ongole.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM OA/887/2018 an amount of Rs.46,96,285/- (Rupees Forty Six Lakhs Ninety Six Thousand Two Hundred and Eighty Five Only) along with pendentellite and future interest @ 12.05 % p.a. Compound Interest monthly w.e.f.01-06-2018 till realization and costs has become due against you (Jointly and severally / Fully / Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 23/01/2024 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay : -
   (a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
   (b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 12/12/2023

(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ దుర్మరణం

- మరో యువకుడికి గాయాలు
- తూర్పుగంగవరం వద్ద బైక్‌ను ఢీకొన్న టిప్పర్



రామకృష్ణ మృతదేహం

తాళ్లూరు(ముండ్లమూరు): సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో కంకర అన్‌లోడ్ చేసి రోడ్డెక్కుతున్న టిప్పర్.. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మంగళవారం తాళ్లూరు–తూర్పుగంగవరం మధ్య చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. దర్శి మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన పగడాల రామకృష్ణ(26), అతని స్నేహితుడు పోలంరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి సంక్రాంతి సందర్భంగా చీమకుర్తి మండలం పాటిమీదపాలెంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు మంగళవారం ఉదయం వెళ్లాడు. అక్కడ ఆట ముగిశాక తాళ్లూరులో చదువుకుంటున్న బాబాయి కుమారుడిని ఇంటికి తీసుకెళ్లేందుకు తూర్పుగంగవరం మీదుగా తాళ్లూరు వెళ్తున్నారు. మార్గ మధ్యంలో బ్రిక్స్ యూనిట్‌లో కంకర అన్‌లోడ్ చేసి రోడ్డు ఎక్కుతున్న టిప్పర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. రామకృష్ణ లారీ టైర్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హర్షవర్ధన్‌రెడ్డిని స్థానికులు తూర్పుగంగవరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. బొట్లపాలెం గ్రామానికి చెందిన పడగాల శ్రీనివాసరావు, సుబ్బులు దంపతులకు ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. వారిలో రామకృష్ణ, హరికృష్ణ కవల పిల్లలు. హరికృష్ణకు గత ఏడాది వివాహం చేశారు. మృతుడు రామకృష్ణ డిగ్రీ పూర్తి చేసి బొట్లపాలెంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వైవీ రమణయ్య పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తానని చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఒంగోలు: సెలవుల మంజూరు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలను ఇంటర్మీడియెట్ ప్రాంతీయ మండలి పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ హెచ్చరించారు. ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో కాలేజీలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

కొండమంజులూరులో టీ-20 ప్రారంభం



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి

జే.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరులో మంగళవారం పానెం హనిమిరెడ్డీస్ జాతీయ స్థాయి టీ–20 క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కొండమంజులూరు క్రికెట్ క్లబ్ చైర్మన్ కరణం స్వామి, సెక్రటరీ వెంకన్న బాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో హనిమిరెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి సందర్భంగా గత 29 ఏళ్లుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద టోర్నమెంట్‌ను గ్రామ స్థాయిలో నిర్వహించడం గర్వకారణమన్నారు.

హోరాహోరీగా మెదటి లీగ్ మ్యాచ్

మెదటి లీగ్ మ్యాచ్‌లో ఒంగోలు బుల్స్ , శ్రీకాకుళం జట్టు హోరాహోరీగా తలపడ్డాయి. శ్రీకాకుళం జట్టు నిరీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఒంగోలు బుల్స్ జట్టు 15 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 158 పరుగులు చేసి విజయం సాధించింది. ఒంగోలు జట్టుకు చెందిన జోష్ 49 బంతుల్లో 80 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

Paper Publication
(Substituted Service)
FORM NO.14
[See Regulation 33 (2)]

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam, Sai Baba Street,
Daba Gardens, Visakhapatnam - 530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)

R.P.No.248 of 2019 in OA No.220 of 2017

Union Bank of India,Kamepalli Branch, Prakasam District
Versus
M/s Sri Rama Tobaccos & another

To
(CDR1) M/s Sri Rama Tobaccos, Rep. by its Prop: Kummara Brahmaiah. S/o Ramaiah, H.No.11-1-95, Santhosh Nagar, Ward No.11, Kandukuru, Prakasam District.
(CDR 2) Sri Korrakuti Venkateswarlu, S/o ramaiah, R/o Janardhanapuram Village, Chatukupadu Panchatyat, Jarugumalli Mandalam, Prakasam District.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM OA/220/2017 an amount of Rs.36,77,138.40/- (Rupees Thirty Six Lakhs Seventy Seven Thousand One Hundred and Thirty Eight and Forty Paisa Only) along with pendentellite and future interest @ 12.25 % p.a. with monthly w.e.f. 13-03-2017 till realization and costs has become due against you (Jointly and severally / Fully / Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 23/01/2024 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay : -
   (a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
   (b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 12/12/2023

(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer